క్లుప్తంగా

వైభవంగా చండీహోమం


విజయదుర్గ అమ్మవారి ఆలయంలో చండీహోమం నిర్వహిస్తున్న దృశ్యం

జంగారెడ్డిగూడెం : మూలా నక్షత్రం సందర్భంగా శ్రీ విజయదుర్గ అమ్మవారి ఆలయంలో బుధవారం చండీహోమం వైభవంగా నిర్వహించారు. ప్రధాన అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు ఆధ్వర్యంలో జంగారెడ్డిగూడేనికి చెందిన వేద పండితులు శ్రీకృష్ణ చండీహోమం అత్యంత వైభవంగా జరిపారు. మారిశెట్టి సత్యనారాయణ, బాల చిట్టెమ్మ దంపతులు, కొనిజర్ల శ్రీనివాస్, ఛాయాదేవి దంపతులు, చిన్నం సాయి రెడ్డి, రమ్య దంపతులు, ఎస్.వెంకటరమణ, కనకలక్ష్మి దంపతులు ఉభయదారులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ శేష వస్త్రాలతో సత్కరించింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు మారిశెట్టి రాధాకృష్ణ, కమిటీ సభ్యులు, సహాయ కార్యదర్శి రామిశెట్టి శ్రీనివాసరావు, నీలం మధు సాయిరాం, జిల్లేపల్లి శివకృష్ణ, మహిళా సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అభినందనలు


విద్యార్థులను అభినందిస్తున్న ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి

పోలవరం రూరల్ : పోలవరం మండలంలో పదో తరగతి పరీక్షల్లో ప్రథమ స్థానం సాధించిన ఇద్దరు విద్యార్థులను ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి సన్మానించారు. పోలవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పోతుల రాముడు, షేక్ ఇర్ఫాన్ ఆలీ 573 మార్కులు సాధించి మండలంలో ప్రథమ స్థానంలో నిలిచారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద ఈ విద్యార్థులకు శాలువా కప్పి సన్మానించి, ప్రోత్సాహక బహుమతి అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మార్చి విద్యార్థులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తున్నారన్నారు. ఇదేవిధంగా రాబోయే రోజుల్లో కూడా విద్యార్థులు మరింత కష్టపడి చదివి పాఠశాలకు, గ్రామానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

వెటర్నరీ సంఘ సభ్యులకు సన్మానం


వెటర్నరీ ఎన్నికల్లో ఎన్నికైన వారిని సన్మానించిన దృశ్యం

బుట్టాయగూడెం(జీలుగుమిల్లి) : జిల్లా పారపశువర్థక శాఖ సిబ్బంది సంఘంలో ఎన్నికైన జీలుగుమిల్లి ప్రాంతీయ పశువర్థక శాఖకు చెందిన సత్యనారాయణ, అమ్ములు, రాజు, భవానీలను బుధవారం జీలుగుమిల్లిలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సహాయ సంచాలకులు ఎం. సాయి బుచ్చారావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల పరిధిలో జరిగిన ఈ ఎన్నికల్లో జీలుగుమిల్లి ప్రాంతీయ కార్యాలయం నుంచి నలుగురు ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో డాక్టర్ బీఆర్ శ్రీనివాసన్, సిబ్బంది నాగు, పుష్పలత, తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు రూ. లక్ష విరాళం


దాతకు విరాళం బాండ్ పత్రాన్ని అందిస్తున్న దృశ్యం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన ట్రస్టుకు హైదరాబాద్‌కు చెందిన మైనేని కృష్ణారావు బుధవారం రూ.లక్ష విరాళంగా అందజేశారు. ముందుగా స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఈ విరాళాన్ని ఆలయ కార్యాలయంలో జమచేశారు. ఈ సందర్భంగా దాతకు ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు విరాళం బాండ్ పత్రాన్ని అందించారు.

మట్టి తవ్వకాలపై ఫిర్యాదు

కొయ్యలగూడెం: దిప్పకాయలపాడు రాజుచెరువులో అనుమతులకు మించి మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి. అనుమతులకు మించి పొక్లయినేలను ఉపయోగిస్తూ మట్టి తవ్వి తరలిస్తున్నారని పీడబ్ల్యూడీ రవీంద్ర, ఏఈ సీహెచ్ భాస్కరరావుకు ఫిర్యాదులు వెళ్లాయి. దీనిపై విచారణ చేపడతామని వారు చెప్పారు.

రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

- ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా
- శ్రీనివాసపురంలో గడప గడపకు మన ప్రభుత్వం


శ్రీనివాసపురంలో ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరిస్తున్న ఎమ్మెల్యే ఎలీజా

జంగారెడ్డిగూడెం రూరల్ : రైతుల వద్ద ప్రతి ధాన్యం గింజనూ ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైతులకు అండగా నిలుస్తామని చింతలపూడి ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా అన్నారు. మండలంలోని శ్రీనివాసపురంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఎలీజా పాల్గొని ప్రజల వద్దకు వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. అంగన్వాడీ కేంద్రాల్లో సీమంతాల కార్యక్రమాల్లో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చింతలపూడి నియోజకవర్గంలో అకాల వర్షాలకు తడిసిన పంటల విషయాన్ని వ్యవసాయశాఖ మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. రైతుల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, రైతులకు ఏ సమస్య వచ్చినా అన్ని విధాలా ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉంటుందన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ఏనాడు చంద్రబాబు రైతుల సంక్షేమానికి కృషి చేయలేదని, అధికారం కోల్పోయిన తర్వాత రైతుల గురించి మొసలి కన్నీరు కారుస్తున్నారన్నారు. వ్యవసాయం దండగ అంటూ, ఉచిత విద్యుత్‌ను ఎద్దేవ చేస్తూ , రైతులపై కాల్పులు జరిపిన చంద్రబాబు నేడు రైతుల గురించి మాట్లాడటం సిగ్గుచేటన్నారు. చంద్రబాబు ఏది చేయమంటే అది చేసేలా పవన్ కల్యాణ్ తయారయ్యారన్నారు. రైతుల సంక్షేమం కోసం ఆలోచించిన ఏకైక ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ఎమ్మెల్యే ఎలీజా అన్నారు. రైతులకు అన్ని విధాలా సహాయ సహకారాలు అందిస్తూ, రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటుతో పాటు, విత్తనాల పంపిణీ, పంటల విక్రయాలు జరిపే వరకు అన్ని విధాలా రైతులకు ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. సంక్షేమం దిశగా ప్రభుత్వం పరిపాలన చేస్తుంటే చంద్రబాబు, పవన్‌కల్యాణ్ బురదజల్లే ప్రయత్నాలు చేస్తూ రైతులను, ప్రజలకు పక్కదోవ పట్టించే ప్రయత్నాలు చేస్తున్నారన్నారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు, రైతులు వారిని నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వచ్చే ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ జంగారెడ్డిగూడెం నుంచి ములగలంపల్లి వెళ్లే రహదారి, అక్కంపేట వెళ్లే రహదారికి ఈనెల 11న ఎమ్మెల్యే ఎలీజా శంకుస్థాపన చేస్తారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కొదమ జ్యోతి, సర్పంచ్ పోల్నాటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఎంపీటీసీ జుజ్జువరపు తాతారావు, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

శ్రీవారి సన్నిధిలో ఎమ్మెల్సీ కవురు


కవురు శ్రీనివాస్‌కు శ్రీవారి మొమెంటోను అందిస్తున్న ఆలయ ఈఓ త్రినాధరావు

ద్వారకాతిరుమల : ద్వారకాతిరుమల శ్రీవారి ఆలయాన్ని ఏలూరు జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీ కవురు శ్రీనివాస్ కుటుంబ సభ్యులతో కలిసి బుధవారం దర్శించారు. స్వామి, అమ్మవార్లను దర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ ముఖ మండపంలో అర్చకులు, పండితులు ఆయనకు శ్రీవారి శేషవస్త్రాన్ని కప్పి, వేద ఆశీర్వచనాన్ని పలుకగా, ఆలయ ఈఓ వేండ్ర త్రినాధరావు చినవెంకన్న మొమెంటోను, ప్రసాదాలను అందజేశారు. ఆ తరువాత కవురు పలు రకాల పండ్లతో తులాభారం తూగి శ్రీవారికి మొక్కుబడి చెల్లించుకున్నారు. ఆ పండ్లను భక్తులకు పంపిణీ చేశారు. ఆయన వెంట వైఎస్సార్ సీపీ నాయకులు బొండాడ వెంకన్న బాబు, జేవీకే రెడ్డి తదితరులున్నారు.

నేడు కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన

కొయ్యలగూడెం: రాజవరం గ్రామంలో శుక్రవారం ఉదయం 6:40 నిమిషాలకు శ్రీ కనకదుర్గమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన, మధ్యాహ్నం నుంచి అన్న సమారాధన నిర్వహించనున్నట్లు సర్పంచ్ ఏలేటి చిన్న తుక్కయ్య, ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. గ్రామంలోని మెయిన్ సెంటర్లో రామాలయానికి ఆనుకుని ఉన్న స్థలంలో దాదాపు రూ.ఆరు లక్షల వ్యయంతో ఈ ఆలయాన్ని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కోట వెంకటేశ్వరరావు, గంగారత్నం దంపతులు అమ్మవారి విగ్రహాన్ని అందచేయగా స్థలాన్ని యర్రమళ్ళ బ్రదర్స్ విరాళంగా అందజేశారన్నారు. ఆలయ నిర్మాణ నిమిత్తం వివిధ సామాజిక వర్గాలకు చెందిన గ్రామస్తులు ధన, వస్తు రూపేణా విరాళాలు అందజేసినట్లు తెలిపారు. ఉత్సవ నిర్వహణలో గ్రామస్తులు బంధుమిత్రులతో కలిసి పాల్గొననున్నారని అన్నారు.

తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు


సత్యసాయి వాటర్ ట్యాంక్‌ను ప్రారంభించిన దృశ్యం

పోలవరం రూరల్ : పోలవరం పంచాయతీ పరిధిలో ప్రజలకు తాగునీటి ఎద్దడి లేకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ పాదుం పుష్ప పేర్కొన్నారు. బెస్తా వీధిలో నూతనంగా నిర్మించిన సత్యసాయి తాగునీటి వాటర్ ట్యాంక్‌ను ఆమె ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు బుగ్గా మురళీకృష్ణలతో కలిసి బుధవారం ప్రారంభించారు. సత్యసాయి మంచినీటి పథకం ద్వారా మిగిలిన ట్యాంక్‌లకు కూడా త్వరలోనే కనెక్షన్లు ఏర్పాటుచేసి ప్రజలకు తాగునీరు సరఫరా చేసేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ కోరసిక శ్రీనివాస్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లు

- ఎమ్మెల్యే తెల్లం బాలరాజు
- పి.అంకంపాలెంలో గడపగడపకు మన ప్రభుత్వం


ప్రజలకు ప్రభుత్వ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే బాలరాజు

బుట్టాయగూడెం (జీలుగుమిల్లి) : కుల, మత, పార్టీలకు అతీతంగా అర్హులైన ప్రతీ ఒక్కరికీ సంక్షేమ లబ్ధి అందించేందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే తెల్లం బాలరాజు అన్నారు. జీలుగుమిల్లి మండలం పి.అంకంపాలెంలో బుధవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బాలరాజు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను వివరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ పాలన సాగుతోందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను గడిచిన నాలుగేళ్లలో 98 శాతం నెరవేర్చి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల మన్ననలను పొందుతున్నారని అన్నారు. గతంలో ఎన్నడూ చూడని విధంగా రాష్ట్రంలో సుపరిపాలన చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌పై టీడీపీ నాయకులు లేనిపోని అసత్య ప్రచారాలు చేస్తున్నారని బాలరాజు విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో మళ్లీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిగా ఎన్నుకోవాలని ఆయన కోరారు. అప్పుడే అన్ని వర్గాల ప్రజలకు మేలు జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ మల్లం వసంతరావు, ఎంపీపీ కోర్సా పోచమ్మ, వైస్ ఎంపీపీ సోమగాని శ్రీనివాస్, మండల కన్వీనర్ గూడవల్లి శ్రీనివాసరావు, సొసైటీ అధ్యక్షుడు బోదా శ్రీనివాసరెడ్డి, గంటసాల గాంధీ, ఎంపీటీసీ వెంకటలక్ష్మి, నాయకులు చందా ప్రసాద్, మండల సచివాలయాల కన్వీనర్ వనమా రామకృష్ణ, నాయకులు చిట్టిబొమ్మ శ్రీనివాసరావు, కుంజా చిన్న రాముడు, మునకల బాబు, పేరాబత్తుల వినయ్, బొంతు వెంకట్, బోయా వెంకట్రావు, కక్కిరాల రాము, కతారి రాఘవులు, ఆకుల రవి, దాకారపు ధర్మారావు, హనుమకొండ కృష్ణ, పాలగాని చిన్న, సుధాకర్, ఎంపీడీఓ కె.మంగతాయారు, ఎస్సై చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలి


ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

జంగారెడ్డిగూడెం : ఉపాధి హామీ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని, లేనిపక్షంలో నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని గద్దె దించుతామని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. సంఘ జిల్లా అధ్యక్షుడు ఎం.జీవరత్నం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో వి.వెంకటేశ్వర్లు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఏ.రవి పాల్గొని మాట్లాడారు. మే 4 నుంచి 9వ తేదీ వరకు జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, పోలవరం, బుట్టాయిగూడెం, కుక్కునూరు, వేలేరుపాడు, జీలుగుమిల్లి, టి.నరసాపురం, కామవరపుకోట, ద్వారకాతిరుమల మండలాల్లో ఉపాధి హామీ పని ప్రదేశాల్లో తిరిగి కూలీల బాధలు తెలుసుకున్నామన్నారు. కూలీల సమస్యల పరిష్కారం కోసం ధర్నా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పేదలకు ఉపయోగపడే ఉపాధి హామీ చట్టానికి, నూతన విధానాలు తీసుకువచ్చి నిర్వీర్యం చేసేందుకు కేంద్రం ప్రయత్నిస్తుండడం అన్యాయమన్నారు. అనంతరం డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఆర్డీఓ కార్యాలయ సిబ్బందికి అందజేశారు. ధర్నాలో సంఘం జిల్లా కమిటీ సభ్యులు తామ ముత్యాలమ్మ, వై.నాగేంద్రం, ఆర్.డానియేలు, ఏ.ప్రభాకర్‌రావు, యాగంటి సీత, కారం దుర్గ, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు తెల్లం రామకృష్ణ, కార్యదర్శి డి,రమేష్, తెల్లం దుర్గారావు, సీఐటీయూ మడివి దుర్గారావు, జి.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

దిశ యాప్‌పై ప్రత్యేక డ్రైవ్


జంగారెడ్డిగూడెంలో దిశ యాప్ ప్రత్యేక డ్రైవ్‌ను నిర్వహిస్తున్న సీఐ బాలసురేష్‌బాబు

జంగారెడ్డిగూడెం : మహిళలు, విద్యార్థినులు, బాలికల సామాజిక రక్షణ కోసం దిశ యాప్ ఉపయోగపడుతుందని, ప్రతి ఒక్కరూ వారి సెల్‌ఫోన్‌లలో దిశ యాప్‌లను కలిగి ఉండాలని సీఐ పి.బాలసురేష్‌బాబు అన్నారు. జంగారెడ్డిగూడెం ప్రధాన సెంటర్‌లో బుధవారం దిశ యాప్‌పై ప్రయాణీకులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మహిళా పోలీసులతో ప్రత్యేక దిశ యాప్ డ్రైవ్ నిర్వహించారు. ముఖ్యంగా యువతులు, మహిళల సెల్‌ఫోన్‌లలో దిశయాప్ డౌన్‌లోడ్ చేయించి, యాప్‌ను ఉపయోగించే విధానాన్ని వివరించారు. అత్యవసర సమయాల్లో వెంట ఉండే పోలీసుగా దిశ యాప్ పనిచేస్తుందన్నారు. ఏదైనా ఇబ్బంది ఏర్పడితే వెంటనే దిశ యాప్ ఉపయోగించి పోలీసులకు సమాచారం ఇవ్వొచ్చన్నారు. వెంటనే దగ్గరలో ఉన్న పోలీస్‌స్టేషన్‌కు సమాచారం అంది అతి తక్కువ సమయంలో రక్షణ పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఎస్సై ఎం.సాగర్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనులకు చిక్కిన పండుగప్ప


కోయరాజమండ్రి చెరువులో చిక్కిన పండుగప్ప చేప

బుట్టాయగూడెం : బుట్టాయగూడెం మండలం కోయరాజమండ్రి సమీపంలో ఉన్న చెరువుపోటుకు వెళ్లిన గిరిజనులకు బుధవారం చేపలకే రాజైన పండుగప్ప చేప చిక్కింది. సాధారణంగా తీర ప్రాంతాల్లోనే పండగప్ప చేపలు జాలర్ల వలలకు చిక్కుతుంటాయి. అలాగే రైతులు చేపల చెరువుల్లో ఈ రకం చేపలను పెంచుతారు. అయితే గిరిజన ప్రాంతంలోని చెరువుల్లో తొలిసారిగా నాలుగున్నర కేజీల పండుగప్ప చేప చిక్కడంతో గిరిజనులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మెల్యే పరామర్శ

లింగపాలెం : శింగగూడెం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు శావా రాజేష్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడడంతో ఆయనను బుధవారం ఎమ్మెల్యే ఉన్నమట్ల ఎలీజా, వైఎస్సార్ సీపీ నేతలు పరామర్శించారు. రాజేష్ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ నాయకులు, బెంగుళూరు టీటీడీ (యల్ఏసీ) లోకల్ అడ్వైజరీ కమిటీ మెంబరు భీమిరెడ్డి వెంకటసూరారెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మందలపు సాయిబాబు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ ముఖ్య నేత ముసునూరి వెంకటేశ్వరరావు, వైస్ ఎంపీపీ మట్టా సురేష్, మార్కెట్ యార్డు డైరెక్టర్ కుప్పాల రామకృష్ణ, మండల సేవాదళ్ కన్వీనర్ రెడ్డి బాబ్జి, పార్టీ నాయకులు కర్లపూడి ఆనంద్, నూతులపాటి శ్రీను, సీహెచ్ సత్యన్నారాయణరెడ్డి తదితరులు పరామర్శించిన వారిలో ఉన్నారు.

ఏజెన్సీలో విస్తృతంగా సేవలందిస్తాం


బుక్ ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభించిన ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్

కుక్కునూరు : ఏజెన్సీలోని బ్యాంక్ ఖాతాదారులకు మరింత విస్తృతంగా సేవలందించే దిశగా ఏపీజీవీబీ చర్యలు చేపట్టిందని ఏపీజీవీబీ రీజనల్ మేనేజర్ ఉదయ్ చెప్పారు. బుధవారం మండలంలోని దాచారం గ్రామంలో బ్యాంక్ సర్వీస్ సెంటర్ నందు మైక్రో ఏటీఎం ద్వారా పాస్‌బుక్ ప్రింటింగ్ మిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశంలో మొదటిసారిగా ప్రాంతీయ గ్రామీణ బ్యాంక్‌లో మైక్రో ఏటీఎం ద్వారా పాస్‌బుక్ ప్రింటింగ్ సేవలను అందిస్తున్నట్లు చెప్పారు. ఖాతాదారులకు మెరుగైన సేవలందించే విధంగా ఈ టెక్నాలజీని అభివృద్ధి చేసిన ఐరిక్స్ టెక్నాలజీ సంస్థను అభినందించారు. కార్యక్రమంలో ఏపీజీవీబీ కుక్కునూరు బ్రాంచ్ మేనేజర్ మణికుమార్, ఐరిక్స్ రీజనల్ ఇంచార్జ్ శోభన్‌కుమార్, రీజనల్ హెడ్ రవికుమార్, చానల్ మేనేజర్ అఖిల్, బ్యాంక్ మిత్ర ఎం నాగమణి, ఖాతాదారులు పాల్గొన్నారు.

బాల్య వివాహాల నిరోధానికి కృషి చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న జెడ్పీటీసీ శామ్యూల్

ద్వారకాతిరుమల : బాల్య వివాహాల నిరోధానికి అన్ని మతాల పెద్దలు కృషి చేయాలని జెడ్పీటీసీ చిగురుపల్లి శామ్యూల్ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బాల్య వివాహాలపై పాస్టర్లు, పురోహితులు, ఇమామ్‌లకు బుధవారం అవగాహన సదస్సును నిర్వహించారు. ఇందులో ముఖ్య అతిథిగా పాల్గొన్న జెడ్పీటీసీ శామ్యూల్ బాల్య వివాహాలు వల్ల కలిగే అనర్థాలను వారికి వివరించారు. అందరూ సమిష్టిగా కృషి చేస్తే బాల్య వివాహాలను అరికట్టవచ్చన్నారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సెక్టార్ సూపర్‌వైజర్లు మేరి, లక్ష్మీరాజ్యం తదితరులున్నారు.

పోరాటాలతోనే దళితులకు రాజ్యాధికారం సాధ్యం


యర్రంపల్లిలో పల్లెకు పోదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న ఎంఎస్‌పీ నాయకులు

చింతలపూడి : పోరాటాలతోనే దళితులకు రాజ్యాధికారం సాధ్యమని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాల సమన్వయకర్త ముమ్మిడి వరపు చిన్న సుబ్బారావు మాదిగ అన్నారు. చింతలపూడి మండలం యర్రంపల్లి గ్రామంలో చింతలపూడి నియోజకవర్గ మహాజన సోషలిస్ట్ పార్టీ మహిళ నియోజకవర్గ కన్వీనర్ కొలికిపాము హైమావతి అధ్యక్షతన పల్లెకు పోదాం 50 రోజుల టార్గెట్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కోస్తా జిల్లాల సమన్వయకర్త ముమ్మిడివరపు చిన్న సుబ్బారావు మాదిగ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. అంబేడ్కర్ ఆశయాలను ముందుకు తీసుకు వెళ్లడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు. రాజ్యాంగబద్ధంగా ఏబీసీడీ వర్గీకరణ నిర్వహించి మాదిగ ఉప కులాలకు రిజర్వేషన్ కల్పించాలన్నారు. గ్రామాలలో గ్రామ కమిటీలు ఏర్పాటు చేసుకుని మహాజన సోషలిస్ట్ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో సమన్వయకర్త చవటపల్లి విజయ మాదిగ, ఏలూరు జిల్లా కన్వీనర్ కనకరాజు మాదిగ, ఎంఆర్‌పీఎస్ మహిళ నియోజకవర్గ కన్వీనర్ గొల్లపల్లి సౌజన్య, చింతలపూడి మండల ఎంఎస్‌పీ మహిళా కన్వీనర్ పాలిమేర నాగమణి, టి.నరసాపురం మండల ఎంఎస్‌పీ మహిళా కన్వీనర్ కొమ్ముకూరు సుగుణ మాదిగ తదితరులు పాల్గొన్నారు.

చిత్రకారులకు జీవిత సాఫల్య పురస్కారాలు


జీవిత సాఫల్య పురస్కారాలు అందుకున్న చిత్రకారులు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): ఏలూరు ఆర్ట్ సొసైటీ ఏడో వార్షికోత్సవం సందర్భంగా స్థానిక వైఎంహెచ్‌ఏ హాలులో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో చిత్రకళకు చేసిన విశేష సేవలకు గుర్తింపుగా పలువురు కళాకారులకు జీవిత సాఫల్య పురస్కారాలు ప్రదానం చేశారు. పురస్కారం అందుకున్న వారిలో నర్సాపురానికి చెందిన మద్రాసు నివాసి సినీ పబ్లిసిటీ ఆర్టిస్ట్ కడలి సురేష్, ఏలూరు అంబికా ఆర్ట్స్ అధినేత మజ్జి కాంతారావు, శారదా ఆర్ట్స్ అధినేత ఎంపీ ఆచారి, విజయ ఆర్ట్స్ అధినేత ఎం.రామకృష్ణ, సాయిబాబా ఆర్ట్స్ ప్రతినిధి భోగాది రాంబాబు ఉన్నారు. కార్యక్రమానికి గౌరవ అతిథులుగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సాహిత్య అకాడమీ చైర్‌పర్సన్ పిల్లంగోళ్ల శ్రీలక్ష్మి, ఈడా చైర్ పర్సన్ మధ్యాహ్నపు ఈశ్వరి బలరామ్, అంబికా సంస్థల ఎండీ అంబికాప్రసాద్, కార్పొరేటర్ తుమరాడ స్రవంతి హాజరయ్యారు. తొలుత సుమారు 200 మంది భావిచిత్రకారులకు చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. బహుమతులు, అవార్డులు అతిథుల చేతులమీదుగా చిన్నారులకు అందించారు. నాట్యాచార్య గండికోట రాజేష్ శిష్య బృందం నిర్వహించిన కూచిపూడి నృత్య ప్రదర్శన ప్రేక్షకులను ఆకట్టుకుంది. ఏలూరు ఆర్ట్ సొసైటీ అధ్యక్షులు మజ్జి కాంతారావు అధ్యక్షతన, కార్యదర్శి చిత్రాలయ రాంబాబు కార్యక్రమాన్ని పర్యవేక్షించారు.

విద్యార్థుల ప్రోత్సాహానికి రూ.లక్ష విరాళం

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): స్థానిక కోటదిబ్బ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చదివి అత్యుత్తమ ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించే నిమిత్తం ఒక దాత కళాశాలకు రూ.లక్ష విరాళం అందజేశారు. కాలిఫోర్నియాకు చెందిన దివంగత చుండూరి వెంకటా చలపతి జ్ఞాపకార్థం ఆయన సోదరులు కాలిఫోర్నియాకే చెందిన చుండూరి రామకృష్ణ నరేంద్ర, సీహెచ్ ఆర్‌వీవీఎస్ ఆచార్యులు కలిపి సమకూర్చిన రూ.1లక్ష చెక్కును ఆచార్యులు దంపతులు బుధవారం కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ టీఎం ధనుంజయరావుకు అందజేశారు. రూ.1 లక్ష ఫిక్సిడ్ డిపాజిట్ చేసి దానిపై వచ్చే వార్షిక వడ్డీని ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రోత్సాహకంగా అందించాలని కోరారు. చుండూరి సోదరులు గతంలో కూడా తమ కళాశాలకు రూ.లక్ష విరాళం అందించారని, వారి దాతృత్వానికి కృతజ్ఞతలు తెలుపుతున్నామని ప్రిన్సిపాల్ ధనుంజయరావు తెలిపారు.

ఆస్తి తగాదాలతో అన్నదమ్ముల దాడి

ఏలూరు టౌన్: ఆస్తి తగాదాల నేపథ్యంలో అన్నదమ్ములు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. ఈ దాడిలో అన్న రిటైర్డ్ ఆర్మీ ఉద్యోగి ముంగర రాజు గాయపడగా ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. మరోవైపు అతని తమ్ముళ్లు నాగరాజు, దుర్గాప్రసాద్ తమపైనా దాడి జరిగిందంటూ హాస్పిటల్‌లో చేరారు. వైద్యులు ఎమ్మెల్సీ నమోదు చేసి వైద్యం చేస్తున్నారు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. ముంగర రాజు ఆర్మీలో పనిచేసి పదవీ విరమణ చేశారు. ఆయన కైకలూరు సమీపంలోని ఆటపాకలో నివాసం ఉంటున్నారు. అతని సోదరులు రాజేంద్రప్రసాద్, నాగరాజు, దుర్గాప్రసాద్ ఏలూరు మండలం కోమటిలంకలో ఉంటున్నారు. కోమటిలంకలో వీరికి ఉమ్మడి ఆస్తిగా చేపలచెరువు ఉంది. ఈ చెరువు విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం నెలకొంది. బుధవారం కోమటిలంకలో ముంగర రాజు, నాగరాజు, దుర్గాప్రసాద్ గొడవ పడ్డారు. ఈ ఘటనలో రాజు గాయపడగా ఏలూరు సర్వజన ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. తమ్ముళ్లు నాగరాజు, దుర్గా ప్రసాద్ కూడా హాస్పిటల్‌లో చేరటంతో ఎమ్మెల్సీ కేసు నమోదు చేశారు. ఏలూరు రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

లక్కవరంలో కొండ చిలువ హతం



జంగారెడ్డిగూడెం రూరల్: లక్కవరంలో పంట పొలాల్లో వరి కోతలు చేస్తున్న సమయంలో భారీ కొండచిలువ కంటపడింది. దీంతో పనిచేస్తున్న రైతులు, కూలీలు అక్కడ నుంచి పరుగులు తీశారు. ఎంతసేపటికి కొండచిలువ వెళ్లకపోవడంతో కర్రలతో కొట్టి హతమార్చారు. స్థానిక ప్రజలు కొండచిలువను చూసేందుకు తరలివచ్చారు.